జ్యూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో 'జ్యూట్ బ్యాగ్' తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 13 రోజులపాటు జరిగే ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫొటోలతో ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లావాసులై ఉండి, చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యల్ని పరిష్కరించాలి

మంత్రి పొన్నంకు ఆటో జేఏసీ వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

శంషాబాద్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం తెలంగాణ ఆటో జేఏసీ, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు ఐకాస ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి సంస్థలతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో జేఏసీ హబీబ్, రవి, బీఎంఎస్ రవి, పల్లెర్లరవి తదితరులున్నారు. రాజకీయ ఆటోబంద్‌ను తాము వ్యతిరేస్తున్నామని భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ తెలిపారు.

బీఎంఎస్ ఆటోస్టాండ్ ప్రారంభం


బీఎంఎస్ ఆటోస్టాండ్‌ను ప్రారంభించిన నందకిశోర్

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటోస్టాండ్‌ను బీఎంఎస్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నేత సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి


ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్సులు 'వన్ వే'లో నడపాలని మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కోఠి నుంచి శ్రీరామ్ కాలనీకి వయా మధుబన్ కాలనీ కాకతీయ పాఠశాల నుంచి బస్సులు వెళుతున్నాయి. శ్రీరామ్‌కాలనీ నుంచి కోఠికి తిరిగి వెళ్లేటప్పుడు మధుబన్ కాలనీ చౌరస్తాలో ఉన్న శ్రీగాయత్రి పాఠశాల ముందు నుంచి వెళ్లాలని కోరారు. అనంతరం రాజేంద్రనగర్ డిపో మేనేజర్ మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు తప్పనిసరిగా బస్సును వన్ వేలో నడిపిస్తామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, వీరాంజనేయ దేవాలయం కమిటీ సభ్యులు కిషోర్, ఉదయ్, చిన్నా, మ్యాకల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌రహిత దేశం కావాలని విద్యార్థుల ర్యాలీ


డ్రగ్స్ రహిత దేశం కావాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ఐ రాజేందర్ అన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లిలోని సెయింట్ ఆంటోనీ పాఠశాలలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిషాముక్త్ భారత్ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ డ్రగ్స్ ఫ్రీ ఇండియాగా మారాలని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా యువతపై ఈ డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ నేతలు మహేందర్, రాహుల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో హ్యుందయ్ మోటార్స్ ఇండియా కొత్త షోరూంలు ప్రారంభించారు. నార్సింగిలో గీతా హ్యుందయ్ షోరూంను కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ ప్రారంభించారు. డీలర్లు, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో




ప్రజాపాలన విజయోత్సవాల్లో ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ తదితరులు


పారిశుధ్య సిబ్బందిని సన్మానిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర


మహిళాపొదుపు సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న లతాప్రేమ్‌గౌడ్, పూలపల్లి రాజేందర్‌రెడ్డి, శరత్‌చంద్ర

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

బండ్లగూడ: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్బన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. యూపీహెచ్‌సీలో మహిళాశక్తి క్యాంటీన్‌కు మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్, శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు, కమిషనర్ శరత్‌చంద్ర, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, అర్బన్ డే సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వారిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అర్బన్ దే'లో ఉద్యోగులకు సన్మానం

శంషాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శంషాబాద్ మున్సిపాలిటీలో మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ పారిశుధ్య కార్మికులను సన్మానించి, ఉత్తమ ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను సందర్శించారు. ఉద్యోగులు, సిబ్బంది కోసం అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, కౌన్సిలర్ పి. సంజయ్‌యాదవ్, మేనేజర్ శ్రావణి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీల్లో...

మణికొండ: మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీల్లో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అర్బన్ డే నిర్వహించారు. 2కే రన్, మున్సిపల్ సిబ్బందికి ప్రశంసాపత్రాల పంపిణీ, వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళా సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ చేసి స్టాల్స్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్లు ఎం.నాగపూర్ణశ్రీనివాస్, కె.నరేందర్ ముదిరాజ్, కమిషనర్‌లు డి.ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు కె.నరేందర్‌రెడ్డి, జి.విజయ్‌బాబు, మేనేజర్‌లు యోగేష్, శ్రీధర్‌లు, డీఈలు నరేష్, శివసాయి, టీపీఓలు సంతోష్‌సింగ్, మణిహారికలు, కౌన్సిలర్‌లు లక్ష్మీప్రవళిక, పద్మవీరారెడ్డి, జి.సునీతగణేష్, అమరేందర్‌రెడ్డి, దుర్గేష్‌యాదవ్, ఎల్.వందనగేష్, బి.కావ్యశ్రీరాములు, కె. రామకృష్ణారెడ్డి, బి.పద్మారావు, డి.పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణలతో పాటు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం...

రాజేంద్రనగర్: ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆవాస ఆసుపత్రి, యుపీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలోని వైద్య బృందం వైద్య సేవలను అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ రవి కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్రా, డీఎంఓ డాక్టర్ హిమా, నర్సు అంజయ్య, ఫార్మసిస్ట్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నార్సింగిలో మహిళా సంఘాలకు రూ.కోటి చెక్కును అందించిన చైర్‌పర్సన్, కమిషనర్‌లు


మణికొండలో నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్న మున్సిపల్ పాలక కమిటీ సభ్యులు, నాయకులు

విజయోత్సవాల్లో ఖవ్వాలీ

రాజేంద్రనగర్: ఖవ్వాలీతో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం సందడిగా మారింది. ప్రతిరోజు అధికారులు, ప్రజలతో సందడిగా కనిపించే రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఖవ్వాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్కిల్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతోపాటు సిబ్బంది సైతం ఈ ఖవ్వాలీని ఆస్వాదించారు. ఈ కార్యక్రమానికి ముందు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీల కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వివిధ రంగులతో అందంగా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.


విజయోత్సవాల్లో భాగంగా ఖవ్వాలీ కార్యక్రమం

స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయండి

మణికొండ: అతివేగంగా వెళ్లే వాహనాల కారణంగా తమ కాలనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పాయనీర్ ఎస్టేట్, ఈవీవీ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం ప్రారంభమైన పనులను స్థానిక కౌన్సిలర్ నిలిపివేయించటం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్.రవీందర్‌రెడ్డి, కె.రాజేంద్రప్రసాద్, జి.రాంమోహన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగమణి హత్యకేసులో నిందితుడిని శిక్షించాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మస్కు ప్రకాష్ కారత్ డిమాండ్

బండ్లగూడ: కులాంతర వివాహం చేసుకుందని కానిస్టేబుల్ నాగమణిని హత్య చేసిన ఆమె సోదరుడు పరమేష్‌ను తక్షణమే పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మస్కు ప్రకాష్ కారత్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ హైవే పైన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ కారత్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకుంటావా అంటూ పరమేష్ అగ్రకుల దురహంకారంతో ఆమెను నరికి చంపాడన్నారు. కులాంతర వివాహితులకు రక్షణ చట్టం తేవాలన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.


అప్పా చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు

కారోబార్‌లకు యథావిధిగా వేతనాలు చెల్లించాలి


ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కారోబార్‌లు

శంషాబాద్ రూరల్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్‌లకు యథావిధిగా వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీఓ ఉషాకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో కారోబార్‌లు సుమారు 20 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జి.రాజిరెడ్డి, సభ్యులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, అరవింద్, పెంటయ్య, బాల్‌రాజ్, మధు, ధనుంజయ, శేఖర్, నర్సింహా, సేవ్యా, రాజిరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలపై డీఎంహెచ్‌వోకు వినతి

రాజేంద్రనగర్: లెప్రసీ సర్వే నిర్వహించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సునీత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో ఆఫీస్ ముందు ఆశా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గతంలో లెప్రసీ సర్వే చేసిన ఆశా వర్కర్లకు ఇంతవరకు పారితోషికం చెల్లించలేదన్నారు. వెంటనే తమకు డబ్బులు చెల్లించాలన్నారు. అదేవిధంగా పైఅధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీన ఆశా వర్కర్లకు వేతనాలు చెల్లించాలని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, రాజేంద్రనగర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బచ్చలకూర స్వామి, సునంద, రాధిక, రమ్య, సుధా, మన్యం, యాదయ్య, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సునీత తదితరులు

రోడ్డుపై గుంతలు.. ట్రాఫిక్ చింతలు!

- దుర్గానగర్ నుంచి దారి పొడువునా వాహనాల రద్దీ
- నిత్యం నరకం చూస్తున్న వాహనదారులు



దారి పొడవునా నిలిచిన వాహనాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ సిగ్నల్ నుంచి ఆరాంఘర్ సిగ్నల్ వరకు వంద అడుగుల 'వన్ వే'లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురువుతోంది. వాహనదారులు, స్కూల్ బస్సుల్లో పిల్లలు ట్రాఫిక్‌లో నరకం చూస్తున్నారు. దారి పొడవునా వాహనాలు స్తంభించి పోతున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డి నగర్ కాలనీలవాసుల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. వాహనదారులు కూడా అడ్డదిడ్డంగా వెళ్తూ ట్రాఫిక్ సమస్యను జఠిలం చేస్తున్నారు. కూతవేటు దూరంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్రిడ్జి కింద ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉన్నట్లయితే కొంతమేరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించవచ్చని వాహనదారులు అంటున్నారు.


దుర్గానగర్ నుంచి వచ్చే వాహనాలు ఇలా..

సీసీ రోడ్డుతో సమస్యకు పరిష్కారం

ఆరాంఘర్ బ్రిడ్జి కింద ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. వాహనాలు బారులు తీరుతున్నాయి. త్వరలో బ్రిడ్జి కింద సీసీ రోడ్డు వేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం. రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్‌గౌడ్

రోజూ ఇబ్బందులే...



ప్రతి రోజు ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు పడుతున్నాం. దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్ అవుతోంది. కనీసం ఈ కాలనీలకు అంబులెన్స్ రావడానికి కూడా దారి లేదు.

గంజి జగదీష్,
మార్కండేయనగర్ నివాసి

ఘనంగా వ్యవసాయవిద్యా దినోత్సవం


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని వ్యవసాయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వీక్షించడానికి 27 పాఠశాలల నుంచి 2 వేల మంది విద్యార్థులు వచ్చారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను పలువురు అభినందించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, రిజిస్ట్రార్ శివాజీ, అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రశాంత్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్టాల్స్‌లో ఉన్న వాటి గురించి బాలికలకు వివరిస్తున్న పీజీ విద్యార్థులు


మొక్కల గురించి అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులు